క్లుప్తంగా

స్వర్ణాంధ్ర - 2047 ప్రణాళిక సిద్ధం చేయండి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా

ఎమ్మిగనూరురూరల్: స్వర్ణాంధ్ర - 2024కు అధికారులు పక్కా ప్రణాళిక తయారు చేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారి సలీంబాషా ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ సమావేశ భవనంలో మండల స్థాయి అన్నిశాఖల అధికారులతో స్వర్ణాంధ్రపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులు తమ పరిధిలోని ఏమి అభివృద్ధి చేయాలో, ఎలా చెయ్యాలో అనేది ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ బంగా రమ్మ, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.50వేల విరాళం



డీడీని బ్యాంకు మేనేజరుకు అందజేస్తున్న ఉపాధ్యాయ బృందం

కౌతాళం: విజయవాడ వరద బాధితులకు తమ వంతుగా కౌతాళం ప్రతిభ హైస్కూల్ వారు రూ.50వేలను విరాళంగా అందజేశారు. ఈ మేరకు డీడీని బుధవారం కెనరా బ్యాంకు మేనేజర్ సద్దాంవలికి అందజేశారు. కరస్పాండెంట్ దూద్‌బాషా, హెచ్‌ఎం జ్ఞానేశ్వరి మాట్లాడుతూ.. వరదల వల్ల నిరాశ్రయులైన వారికి ఆదుకోవడానికి తమ వంతుగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం, యాజమాన్యం కలిసి ఈ విరాళంను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ మైనుద్దీన్ పర్యవేక్షకులు భీమేష్, రాజప్ప, జయలక్ష్మి, శిరీష, ముంతాజ్, ఈరన్న, శివశంకర్, ఖాజాపీర్ పాల్గొన్నారు.

పోస్టల్ సేవలను జనంలోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న పోస్టల్ ఎస్పీ జనార్దన్‌రెడ్డి

కౌతాళం: పోస్టల్ సేవలను జనంలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి పోస్టల్ ఉద్యోగిపై ఉందని జిల్లా పోస్టల్ ఎస్పీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పోస్టు ఆఫీసులో సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వినియోగదారుల కోసం ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టిందని, ఆ పథకాలు ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో ఆదోని ఏఎస్పీ శ్రీధర్, కౌతాళం పోస్టుమాస్టర్ రాగప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో విచారణ



మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ డా.మాధవి

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయి, డాక్టర్ల మధ్య డ్యూటీల విషయంలో వివావాదం ముదిరి, సీఎంవో కార్యాలయానికి ఫిర్యాదు వెళ్లంది. దీంతో బుధవారం డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మాధవి విచారణకు వచ్చారు. డీసీహెచ్‌ఎస్ మాట్లాడుతూ ఇక్కడ పనిచేస్తున్న వైద్యులతో మాట్లాడి వారు చెప్పిన విషయాలను రికార్డ్ చేసుకొని పై స్థాయి అధికారులకు నివేదిక ఇస్తామని తెలిపారు. అయితే ఏఐవైఎఫ్ నాయకులు రాజీవ్ సూపరింటెండెంట్‌పై గతంలో వచ్చిన ఫిర్యాదులపై ఇంత వరకు మీరు ఏమి చర్యలు తీసుకున్నారో చెప్పాలని డీసీహెచ్‌ఎస్‌తో వాగ్విదానికి దిగారు. గతంలో జరిగిన సంఘటనలపై కలెక్టర్‌కు విచారణ చేసిన నివేదిక ఇచ్చామని ఆమె నాయకులకు సమాధానమిచ్చారు.

డెంగీ కేసు నమోదు

గోనెగండ్ల : మండల పరిధిలోని చిన్నమరివీడు గ్రామంలో 34 ఏళ్ల వ్యక్తికి డెంగీ నిర్ధారణ అయినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. దీంతో బుధవారం వైద్య సిబ్బందితో కలసి చిన్నమరివీడు గ్రామానికి వెళ్లి డెంగీ బాధితుడి ఇంటి పరిసరా ప్రాంతాల్లో మురుగు నీరు, నిల్వ ఉన్న నీటిని తొలగించి దోమల మందును పిచికారీ చేయించారు. అలాగే గ్రామంలోని బీసీ కాలనీలో మెడికల్ క్యాంపు నిర్వహించి వైద్య పరీక్షలు చేసి గ్రామస్తులకు డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుధాకర్, కృష్ణ పాల్గొన్నారు.

ఇరిగేషన్ జేఈ మృతి



రంగస్వామి(ఫైల్)

పెద్దకడబూరు : మండలంలో ఇరిగేషన్ జేఈగా పనిచేస్తున్న రంగస్వామి(50) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. రాత్రి 8గంటల సమయంలో ఇంట్లో గుండెపోటు రావడంతో కింద పడిపోయారు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేకపోయారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

దోమకాటు.. ఆరోగ్యానికి చేటు

- పారిశుద్ధ్య లోపం వల్ల దోమల వృద్ధి
- విష జ్వరాలతో బాధపడుతున్న ప్రజలు
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికే ముప్పంటున్న వైద్యులు
- తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచన



గోనెగండ్లలో ప్రధాన రహదారి పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం



ఆసుపత్రిలో వేచివున్న జ్వరపీడితులు



డాక్టర్. కార్తీక్, పీహెచ్‌సీ, గోనెగండ్ల

గోనెగండ్ల : ఇటీవల వస్తున్న వ్యాధుల్లో చాలా వరకు దోమకాటుకు సంబంధించినవే. పరిశుభ్రత లోపం వల్ల దోమలు రోజురోజుకూ వృద్ధి చెందుతూ తమ ప్రతాపం చూపుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో దోమ కాటు వల్ల ప్రజలు డెంగీ, మలేరియా, జ్వరం బారిన పడుతున్నారు. పరిసరాల పరిశుభ్రత విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం ఉన్నా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. అలాగే జ్వరాన్ని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. గోనెగండ్ల పీహెచ్‌సీలో ప్రతిరోజూ జ్వర బాధితులు క్యూ కడుతున్నారు. రోజుకు 150 వరకు ఓపీ ఉండగా.. ఇందులో ఎక్కువ శాతం జ్వరపీడితులే ఉన్నారు. ఈ నేపథ్యంలో గోనెగండ్ల పీహెచ్‌సీ డాక్టర్ కార్తీక్ దోమకాటు వల్ల వచ్చే వ్యాధులు, నివారణకు తీసుకోవలసిన చర్యలను వివరించారు.

దోమకాటుతో వచ్చే వ్యాధులు, లక్షణాలు

మలేరియా: ఆడ అనాఫిలస్ దోమ కుట్టడంతో మలేరియా వ్యాధి సోకుంతుంది. చలి, వణుకుతో జ్వరం రావడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, జ్వరం విడిచి వస్తూ ఉంటుంది.

డెంగీ: పగటి సమయంలో కుట్టే ఏడీస్ ఆడ దోమల ద్వారా డెంగీ వ్యాధి సంక్రమిస్తుంది. ఇది సాధారణ వైరస్ జ్వరం, ఎముకలు, కండరాలు, కీళ్లనొప్పులతో జ్వరం మొదలవుతుంది. ప్లేట్లెట్స్ అమాంతం తగ్గిపోతాయి. హఠాత్తుగా తీవ్ర జ్వరం రావడం, కదలలేని స్థితి, ఎముకలు, కండరాలలో భరించలేని నొప్పి, శరీరంపై ఎర్రని దద్దుర్లు, వాంతులు, వికారం, నోరు ఎండిపోవడంతో పాటు చిగుళ్లు, ముక్కు ద్వారా రక్తం వస్తుంది.

చికున్ గున్యా: ఎడిస్ ఈజీప్టై దోమలతో ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. చేతులు, కాళ్లు, కీళ్లలో వాపు వచ్చి కనీసం అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. జ్వరంతో మనిషి బలహీనంగా ఉంటారు. తలనొప్పి, వాంతులు, వికారంతో పాటు హఠాత్తుగా జ్వరం కీళ్ల నొప్పులు, సరిగా నిలబడలేకపోతారు.

పైలేరియా: దీనిని బోధకాలు అని కూడా అంటారు. క్యూలెక్స్ దోమ ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. శరీరంలోని ఏ భాగానికైనా బోదకాలు సోకుతుంది. తరచూ జ్వరం, చంకల్లో, గజ్జల్లో బిళ్లలు కట్టడం, వెన్నుపాము దగ్గరి నుంచి అన్ని అవయవాలపై ప్రభావం చూపుతుంది. అవయవాలకు వాపు, కాళ్లు, చేతులు, స్తనాలు, వరిబీజం, బుడ్డ, జ్ఞానేంద్రియాలు పాడవుతాయి.

మెదడు వాపు : క్యూలెక్స్ ఆడదోమ కుట్టడంతో ఈ వ్యాధి సంక్రమిస్తుంది. జపనీస్ ఎన్‌సెఫలైటిస్ వైరస్ ద్వారా వ్యాపిస్తుంది. ఎక్కువగా 2 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లల్లో ఈ వ్యాధి సంక్రమిస్తుంది. ఆకస్మిక జ్వరం వచ్చి తీవ్రత ఎక్కువ కావడం, విపరీతమైన తలనొప్పి, వాంతులు రావడం, అపస్మారక స్థితికి లోనుకావడం, శరీరంలో ఏదో ఒకపక్క పక్షవాతానికి గురికావడం ఫిట్స్ రావడం వంటి లక్షణాలు ఉంటాయి. పై లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి సరైన చికిత్స తీసుకోవాలి

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- డెంగీ, చికెన్ గున్యా, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే ప్రాణాంతక వ్యాధులను నివారించాలంటే వైద్యం ఇంటి నుంచే ప్రారంభం కావాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే తప్ప దోమల నియంత్రణ పూర్తిగా సాధ్యం కాదు. కాబట్టి ఎవరికి వారు ఇంటి లోపల దోమలు లేకుండా చూసుకోవడమే మంచి మార్గం.
- రాత్రిలో పడుకొనే ముందు దొమతెర వాడాలి. లేదంటే శరీరం పూర్తిగా కప్పబడేటట్లు దుస్తులు వేసుకోవాలి.
- వేపనూనె, కొబ్బరినూనెను 1:1 నిష్పత్తిలో తీసుకొని చర్మంపై రాసుకోవాలి. వేపవాసనకు దోమలు పారిపోతాయి. వేపలో యాంటి బ్యాక్టీరియా, యాంటీ ఫంగల్, యాంటీ వైరస్, యాంటీ ప్రోటోజోల్ గుణాలు ఉన్నాయి.
- ఇంటి సమీపంలో నీరు నిలిచిన చోట దోమలు గుడ్లు పెట్టి ఉంటాయి. కాఫీ డికాషన్ చల్లడం ద్వారా అందులోని దోమల గుడ్లు నీటిపైకి చేరతాయి. అవి ఆక్సిజన్‌కు లోనయి దోమలుగా మారకుండానే నిర్వీర్యమవుతాయి. నీటిలో దోమలు గుడ్లు కూడా పెట్టవు.
- దోమల నివారణకు యూకలిప్టస్, లెమన్ ఆయిల్‌ను చర్మంపై రాసుకోవాలి. దీనివల్ల మన చర్మానికి ఎలాంటి హాని ఉండదు. వీటిలో ఉండే సినోల్ రసాయనం యాంటీసెప్టిక్ కీటక నివారిణిగా పనిచేస్తుంది.
- చీకటి పడుతున్న వేళలో ఇంటి తలుపులు మూసేసి కర్పూరం వెలిగించండి. 20 నిమిషాల తర్వాత తలుపు తెరిస్తే దోమలు కనిపించవు. కర్పూరం మంచి కీటక నివారిణిగా పనిచేస్తుంది.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో హెల్త్ అసిస్టెంట్‌కు గాయాలు

కోసిగి: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కృపానందం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. బుధవారం కందుకూరు గ్రామంలో 104 హెల్త్ క్యాంప్ నిర్వహించి తిరిగి కోసిగి వస్తుండగా కామన్‌దొడ్డి గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలవ్వగా.. కోసిగి పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఎమ్మిగనూరు ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు.

పిడుగుపాటుకు ఇద్దరికి గాయాలు

ఆదోని అర్బన్: పెద్దతుంబళం గ్రామానికి చెందిన హనుమయ్య, నాగవేణి పత్తి పొలంలో పత్తి విడిపించేందుకు వెళ్లారు. వర్షం రావడంతో తాటిచెట్టు కింద నిలబడ్డారు. ఉరుములు, మెరుపులతో సమీపంలో పిడుగు పడటంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వారిని ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధం

పెద్దకడబూరు : విద్యుదాఘాతంతో గుడిసె పూర్తిగా కాలిపోయిన ఘటన మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితుడు మంచోది శాంతిరాజు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు సాయంత్రం శాంతిరాజు చిన్న కోడలు ఇంట్లో వంట గదిలో ఉండగా (స్టావ్ ఆఫ్‌లోనే ఉంది) గుడిసె వెనక భాగం నుంచి మంటలు వ్యాపించాయి. కొంతసేపటికి మంటలు ఎక్కువయ్యాయి. దీంతో ఆమె ఇంట్లో నుంచి బయటకు వచ్చింది. గమనించిన చుట్టుపక్కల వారు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. బంగారు కమ్మలు, రెండు ఉంగరాలు, దాదాపు 60తులాలకు పైగా వెండి పట్టీలతో పాటు మిరుప పెట్టుబడి కోసం ఇంట్లో పెట్టుకున్న రూ.1.5లక్షల నగదు అగ్నికి ఆహుతైనట్లు, దాదాపు రూ.5లక్షలు నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. కట్టుకున్న బట్టలు తప్ప ఏమి మిగలలేదని బాధితుల రోదనలు కంటతటి పెట్టించాయి. ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని కోరారు.

పెట్టుబడి సాయం అందించాలి

ఆదోని రూరల్: రైతులకు అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం కింద రూ. 20 అందజేయాలని, రైతుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆదోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు, నాయకులు పాల్గొన్నారు.

మీటరు బిగించే జీఓను రద్దు చేయాలి

పెద్దకడబూరు : బోరుబావులకు విద్యుత్ మీటర్లు బిగించే జీఓను తక్షణమే రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, రైతుసంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు పరమేష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద దర్నా చేపట్టి, వినతిపత్రాన్ని సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులకు సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఈరన్న, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి

ఆదోని సెంట్రల్/ఆదోని అర్బన్: పట్టణంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని బహుజన డెమొక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ పగడాల రమేష్ కోరారు. బుధవారం 22వ వార్డు పరిశీలనకు వచ్చిన ఎమ్మెల్యే డా. పార్థసారథిని కలసి వినతి పత్రం సమర్పించారు. కాలనీలో సీసీ రోడ్లు, వీధిలైట్లు సరిగా లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని, తాగునీరు వారానికి ఒక సారి రావడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. కార్యక్రమములో బీడీఎస్‌ఎఫ్ నాయకులు పవన్, సాయి, యోహన్ పాల్గొన్నారు.

సమయానికి బస్సులు నడపాలి

ఆదోని టౌన్: పాఠశాలలు, కళాశాలల సమయానికి అనుగుణంగా బస్సులను నడపాలని డిమాండ్ చేస్తూ బుధవారం సాయంత్రం విద్యార్థులు డిపో ఎదుట రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం పీడీఎస్‌ఓ డివిజన్ కార్యదర్శి శివ, పట్టణ

సంక్షిప్తం

నాయకులు కేశవ, రాజు, గోవిందు, మోహన్, అశోక్ ఆధ్వర్యంలో డిపో ముందు కూర్చొని నిరసన తెలియజేశారు. ఆదోని-పత్తికొండ, ఆదోని-దొడ్డనగేరి రూట్లలో సాయంత్రం 5 గంటల నుంచి బస్టాండులో బస్సుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి ఉందని, రాత్రి 7 గంటలైనా బస్సులు రాకపోవడంతో ఇంటికి ఎప్పుడు వెళ్లాలని, రాత్రి 9, 10 గంటల సమయానికి ఇళ్లు చేరుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి

ఆదోని అర్బన్: ఏకాత్మత మానవతావాదం సిద్ధాంతకర్త పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ 151వ జయంతి వేడుకలను బుధవారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలింగ్ బూత్ 161, 162లలో దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్రపటాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విట్టా రమేష్, బీజేవైఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస ఆచారి, నాయకులు ఉలిద్రిమోహన్, మహేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ బీ-ఫార్మసీ కాలేజీలో ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవాన్ని బుధవారం ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసుల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఫార్మసిస్ట్‌లు రోగులకు సరైన మందులు అందించడంలోనే కాకుండా వారి ఆరోగ్య సంరక్షణలో ముఖ్య పాత్ర పోషించాలని సూచించారు.

గొర్రెలు, మేకల పెంపకందార్ల సంక్షేమమే లక్ష్యం

ఎమ్మిగనూరుటౌన్: గొర్రెలు, మేకల పెంపకందార్ల సంక్షేమమే తమ లక్ష్యమని గొర్రెలు, మేకల పెంపకం దార్ల సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు మల్లేష్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాముడు, గోవిందు అన్నారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గొర్రెలు, మేకల పెంపకం దార్ల సంఘ జిల్లా చైర్మన్, వైస్ చైర్మన్లు, 12 డైరెక్టర్ల ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదల కానుందని, అక్టోబర్ 22న పోలింగ్ జరుగనుందని చెప్పారు. ఈ ఎన్నికల్లో తాము పోటీ చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు నాగరాజు, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

మీటర్ రీడర్ల సమస్య పరిష్కరించాలి

ఎమ్మిగనూరుటౌన్: విద్యుత్ శాఖలో మీటర్ రీడర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మీటర్ రీడర్స్ యూనియన్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, నర్సింహారెడ్డి కోరారు. బుధవారం పట్టణంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు.

ఇంజినీరింగ్ కళాశాలకు బస్సు నడపండి

ఎమ్మిగనూరుటౌన్: మండల పరిధిలోని సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని విద్యార్థులు కోరారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఆర్‌పీఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షాహిద్ అఫ్రిది, ఆర్‌యూఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘునాథ్‌ల ఆధ్వర్యంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ నాగరాజుకు విద్యార్థులు వినతిపత్రం ఇచ్చారు. ప్రతిరోజూ 150 మంది దాకా కళాశాలకు వెళ్తున్నామని, సమయానికి బస్సులు లేక ప్రైవేట్ వాహనాలు, ఆటోలను ఆశ్రయించి ప్రమాదాలు కొనితెచ్చుకోవాల్సి వస్తుందన్నారు.

వరద బాధితులకు పాస్టర్ల చేయూత

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ క్రైస్తవ సంఘాల పాస్టర్లు నిత్యావసర సరుకులను సేకరించి విజయవాడకు వెళ్లి వరద బాధితులకు అందజేశారు. విజయవాడలోని సింగ్‌నగర్, వెంబకాలనీ, పున్నమి ఘాట్‌లలో దాదాపు 350 కుటుంబాలకు దుస్తులు, చీరలు, పంచెలు, టవల్స్, ప్లేట్లు, గ్లాసులు, వంట సరుకులను అందజేసినట్లు పాస్టర్లు బుధవారం తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్లు రెవరెండ్ చినబాబు, ప్రసాద్, యోహాన్, ప్రసాద్, శాలెం, సామెల్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

చెత్త సేకరణ వాహనాల నిర్వహణ సక్రమంగా ఉండాలి



చెత్త సేకరించే వాహనాల పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో చెత్త సేకరించే వాహనాల నిర్వహణ సక్రమంగా చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో స్వభావ స్వచ్ఛత-సంస్కార్‌లో చెత్త సేకరించే వాహనాల మరమ్మతులు, ఆయిల్ ఛేంజ్ తదితర పనులను కమిషనర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వాహనాల నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీఈ నీరజ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని పార్క్‌రోడ్, ఇందిరా నగర్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు.

క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా. పార్థసారథి

ఆదోని సెంట్రల్: ప్రతి విద్యార్థి క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలని ఎమ్మెల్యే డా.పార్థసారథి విద్యార్థులకు సూచించారు. బుధవారం పురపాలక మైదానంలో బాలికల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలను పురపాలక చైర్మన్ బి. శాంత అధ్యక్షతన ఎమ్మెల్యే డా. పార్థసారథి ప్రారంభించారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ కో ఆర్డినేటర్లు నరసయ్య, రామన్న పురపాలక, నెహ్రూమెమోరియల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జున, అలీమ్ సిద్దిఖీ, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా అందులో గోనెగండ్ల కేజీబీవీ పాఠశాల విద్యార్థినుల యోగా విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓ మధుసుదన్‌రాజు, హెచ్‌ఎంలు చిత్రలేఖ, గౌసియాబేగం, వ్యాయమ ఉపాధ్యాయులు రాజారాం మోహన్, అస్లాం, బజారప్ప తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

కోసిగి: ప్రతి విద్యార్థి శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఖలీల్ అహ్మద్, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు శంకరయ్య అన్నారు. బుధవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు చెకుముకి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయు లు వెంకటరెడ్డి, గురుస్వామి, శుభాన్ సింగ్, రవికుమార్, నాగప్రసాద్ పాల్గొన్నారు.

ఆదోని అర్బన్: పట్టణంలోని మిల్టన్ గ్రామర్ హైస్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్.హరిప్రసాద్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు కరస్పాండెంట్ రమేష్ అధ్యక్షతన బహుతులను అందజేశారు.

కౌతాళం: ఎరిగేరి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రమేష్ నాయుడు ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్టును జన విజ్ఞాన వేదిక, యుటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

పెద్దకడబూరు : స్థానిక పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక చెకుముకీ సైన్స్ సంబరాలలో భాగంగా 8, 9, 10వ తరగతి విద్యార్థులకు పాఠశాల స్థాయిలో పరీక్షలు నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదవారిపై కాదు.. ఉన్న వారిపై మీ ప్రతాపం చూపండి



ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వాహనాన్ని నిలిపిన శంకర్‌నగర్ కాలనీవాసులు

ఆదోని అర్బన్: రెక్కాడితే గానీ డొక్కాడని తమ ఇళ్లపై కాదని.. ఉన్నవారిపై తమ ప్రతాపం చూపాలని శంకర్‌నగర్ కాలనీవాసులు ఎమ్మెల్యే పార్థసారథి కాన్వాయ్‌ని ఆపి నిలదీశారు. బుధవారం స్థానిక శంకర్‌నగర్ కాలనీలో ×ఇది మంచి ప్రభుత్వం× కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పర్యటించేందుకు వెళ్లారు. దీంతో ఆ కాలనీవాసులు కాలనీ ప్రవేశం వద్దే కాన్వాయ్‌ని ఆపేశారు. తాము కూలీ పనులు చేసుకుంటూ బతికేవారమని, రోడ్డు వెడల్పు, ఎంక్రోజ్‌మెంట్ అంటూ తమ ఇళ్లను తొలగించారన్నారు. పట్టణంలో ఎంతో ఉన్నవాళ్లు ఉన్నారని, రోడ్డు వెడల్పు చేసి ఉన్నవారి కట్టడాలను తొలగించాలన్నారు. ఉన్నవారిపై ప్రతాపం చూపకుండా కాలనీలో రోడ్డు వెడల్పు అంటూ.. అక్రమ కట్టడాలంటూ తమ ఇళ్లను తొలగించడం సరి కాదన్నారు.

ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి



రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024లో భాగంగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ఒక పోలింగ్ కేంద్రంలో 1500 ఓటర్ల కంటే అధికంగా ఉన్న వారిని మరో పోలింగ్ కేంద్రాలకు మార్పుపై రాజకీయ పార్టీ ప్రతినిధుల నాయకులతో సమావేశం నిర్వహించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ గురించి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాముడు, ఎలక్షన్ డీటీ రామేశ్వర్‌గౌడ్, డీఎల్‌పీఓ కార్యాలయపు పరిపాలనాధికారి వీరభద్రప్ప, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బైకుపై నుంచి పడి మహిళ మృతి

పెద్దకడబూరు : మండల పరిధిలోని కల్లుకుంట గ్రామానికి చెందిన ఖాదర్ బీ, భర్త సద్దాం హుసేన్, పిల్లలతో కర్ణాటక రాష్ట్రం సిరుగుప్ప నుంచి ద్విచక్ర వాహనంపై వస్తూ నౌలేకల్లు గ్రామ సమీపంలోని తాటివనం వద్ద కుక్క అడ్డు రావడంతో బైకు అదుపు తప్పగా ఖాదర్ బీ కిందపడిపోయింది. చికిత్స నిమిత్తం కర్నూలుకు తీసుకెళ్లగా.. చికిత్స పొందతూ మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

యువతి అదృశ్యం

మండల పరిధిలోని కల్లుకుంట గ్రామానికి చెందిన చాకలి నాగమ్మ(19) బుధవారం ఉదయం 5గంటల సమయంలో బహిర్భూమికని వెళ్లి రాత్రి అయినా తిరిగి రాలేదు. దీంతో తల్లి చాకలి పద్మావతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కేసు నమోదు

మండల పరిధిలోని నాగులాపురం గ్రామానికి చెందిన బోయ తలారి ఈరన్న అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన నరేంద్ర, వీరేష్ అనే వ్యక్తులు కాలువ పూడిక విషయంలో పడి పారతో కొట్టారు. దీంతో అతనికి గాయాలయ్యాయి. ఈరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

కోసిగి : అక్షరాస్యతలో వెనకబడిన కోసిగి మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ బాషా డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాలలో విద్యార్థుల సమావేశం నిర్వహించారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు విజయ్, కార్యదర్శి అంజి, మహిళా కన్వీనర్ వరలక్ష్మి, ఉపాధ్యక్షులు శివ, ముస్తఫా పాల్గొన్నారు.

అందరిపై కేసు నమోదు చేయండి

కౌతాళం: పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామంలో దళిత మహిళ గోవిందమ్మపై దాడిచేసిన వారందరిపై కేసు నమోదు చేయాలని కోరుతూ తహసీల్దారు మల్లికార్జునస్వామికి వినతి పత్రాన్ని అందజేశారు కేవీపీఎస్ నాయకులు. మండల కార్యదర్శి చిన్న మారయ్య, నాయకులు బసవరాజులో వీరేష్, ఆళ్లప్ప, మల్లయ్య పాల్గొన్నారు.

కోసిగిలో భారీ వర్షం

కోసిగి: మండలంలో మంగళవారం రాత్రి గంటన్నర పాటు భారీ వర్షం కురిసింది. 37.2 మిల్లీ మీటర్లుగా నమోదైంది. పలు వాగులు, వంకలు పొంగి పొర్లాయి. కోసిగి రైల్వే గేటు దాటిన తర్వాత దుద్ది, ఉరుకుంద గ్రామాలకు వెళ్లే రోడ్డులో చాప వాగు ఉధృతంగా ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పెద్దభూంపల్లి గ్రామంలో గద్దుంటి నాగరాజు అనే వ్యక్తికి చెందిన మట్టి ఇల్లు కూలింది. ఇంటి ముందు భాగంలో ఒక్క సారిగా కూలాడంతో వెంటనే అప్రమత్తమై కుటుంబ సభ్యులు బయటకు పరుగుతీసి ప్రమాదం నుంచి బయట పడ్డారు.

సద్వినియోగం చేసుకోండి

గోనెగండ్ల : పొలంబడి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత సూచించారు. బుధవారం మండలంలోని పెద్దమరివీడు, చిన్నమరివీడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

కౌతాళం: పత్తిలో గులాబీ రంగు పురుగుపై రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏఓ శేషాద్రి అన్నారు. లింగాలదిన్నెలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.

కుటుంబం గురించి ఆలోచించండి



మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ కుమారి ఆత్మకూరి శ్రీవల్లి

పెద్దకడబూరు : నేరాలకు పాల్పడేవారు ఇంట్లో కుటుంబసభ్యుల గురించి ఒకసారి ఆలోచిస్తే అసలు నేరాలే చేయరని ఆదోని రెండవ అడిషనల్ మెజిస్ట్రేట్ కుమారి ఆత్మకూరి శ్రీవల్లి అన్నారు. పెద్దకడబూరు మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని చిన్నకడబూరులో ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. చట్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాలలో శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ నడుము బిగించాలన్నారు. లీగల్ ఎయిడ్ సెల్ అడ్వకేట్స్ శ్రీనివాసులు, లోకేష్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

ఆదోని అర్బన్: ఇటీవల విజయవాడకు వెళ్లి పారిశుద్ధ్య పనుల్లో పాల్గొన్న స్థానిక మున్సిపల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులను బుధవారం ఆదోని గ్లోబల్ సర్వీసెస్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి విట్టా రమేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు, జిల్లా సహాయ కార్యదర్శి ఓబి నాగరాజు పాల్గొన్నారు.

గుండెపోటుతో హమాలీ మృతి

ఆదోని రూరల్: పట్టణంలోని జిన్నింగ్ ఫ్యాక్టరీలో హమాలీగా పనిచేస్తున్న 104బసాపురం గ్రామానికి చెందిన రామకృష్ణ(38) గుండెపోటుతో బుధవారం మృతిచెందాడు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు అందించి ఆదుకోవాలని ఏఐటీఎఫ్ జిల్లా కార్యదర్శి గంగన్న, మహిళా సంఘం నాయకురాలు సుగుణమ్మ ఫ్యాక్టరీ యజమాని వెంకటరామిరెడ్డిని కోరారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఆదోని అర్బన్: పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో బుధవారం ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా), వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ (వామ్), దాత ఎన్‌ఆర్‌ఐ కాకుబాళ్ నగేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ముందుగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న టీజీ పాండురంగయ్యశెట్టి, రాచోటి సుధాకర్‌తో పాటు 16 మంది వైద్యులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో దాదాపు 1,186 మంది రోగులకు వైద్య సేవలు, మందులు అందించినట్లు ఆదోని పట్టణ అవోపా మరియు వామ్ అధ్యక్షులు వంకదారి శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. దాదాపు 83 మంది ఉచిత కంటి ఆపరేషన్లకై (ఆరోగ్యశ్రీ) నంద్యాల శాంతిరామ్ ఆస్పత్రికి వెళ్లారన్నారు. కార్యక్రమంలో అవోపా, వామ్ అధ్యక్ష కార్యదర్శులు డైమండ్ రఘు, కోశాధికారి యాదగిరి వెంటకేశ్వర్లు, వెంకటేష్‌బాబు, ప్రతాప్, ఈరన్నశెట్టి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.